రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- బల్దియా స్థలాల్లో అక్రమ కట్టడాలపై నిలదీత
- ప్లకార్డులతో కాంగ్రెస్ కౌన్సిలర్ల నిరసన
- రోడ్ల మరమ్మతు పనుల టెండర్ రద్దుకు బీజేపీ డిమాండ్



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. చైర్మన్ జోగు ప్రేమేందర్ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. సమావేశం ప్రారంభం కాగానే బల్దియా స్థలాలను ఆక్రమించి చేపట్టిన కట్టడాలపై కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్లకార్డులను ప్రదర్శించి నిరసనకు దిగారు. తాంసి బస్టాండ్ వద్ద సులభ్‌కాంప్లెక్స్‌ను కూల్చేసి ప్రైవేట్ వ్యక్తి భవన నిర్మాణాన్ని చేపట్టిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల్లో కట్టడాలన్నింటిపై విచారణ జరిపించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలంటూ నినాదించారు. ఈ అంశాన్ని ఎజెండాలో చేర్చి దీనిపై చర్చించాలని పట్టుబట్టారు. దీంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. అధికారులు సమాధానం చెప్పాలంటూ నిరసనను కొనసాగించారు. కాంగ్రెస్ సభ్యుల నిరసన కొనసాగుతుండగానే ఎజెండా అంశాలపైనే చర్చించాలంటూ బీజేపీ సభ్యులు చైర్మన్ పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదించారు. ఆదిలాబాద్ పట్టణంలో గుంతల మరమ్మతు పనులకు సంబంధించి టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ గడువు ముగిసిన పనులు చేపట్టం లేదని ఆ టెండర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇలా ఇరు పార్టీల సభ్యుల నిరసన నినాదాలతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. చైర్మన్ జోక్యం చేసుకుని వాటిపై చర్చిద్దామని సర్ది చెప్పడంతో శాంతించారు. అనంతరం ఎజెండాపై చర్చ జరుగగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ అధికారుల పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యంగా బల్దియా పరిధిలో అనేక స్థలాలు ఉన్నప్పటికీ వాటిని పరిరక్షించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. కోట్లాది రూపాయల విలువైన మున్సిపల్ లీజు స్థలాలు అన్యాక్రాంతమవుతుంటే వాటిని కాపాడే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాలను కట్టడి చేసేలా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పలు వార్డులలో పారిశుధ్య సమస్య తీవ్ర ఇబ్బందికరంగా మారిందని ఏ వీధికెళ్లినా పరిసరాలు కంపు కొడుతున్నాయన్నారు. దీంతో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు మంచాన పడుతున్నారన్నారు. తాగునీరు సైతం సక్రమంగా సరఫరా కావడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ పేరుమీద అప్పటి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసినా.. క్షేత్రస్థాయిలో ఇప్పటికీ నీటి సరఫరాలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని అధికారుల దృష్టికి తెచ్చారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎజెండాను ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా పట్టణంలోని పశువధశాల నిర్మాణానికి పట్టణ ప్రగతి కింద రూ.50లక్షలతో ప్రతిపాదించిన పనులకు నిధులు రాకపోవడంతో 15వ ఆర్థికసంఘం నిధులను కేటాయించాలంటూ టేబుల్ ఎజెండాగా చేర్చారు. దీన్ని పార్టీలకతీతంగా కౌన్సిల్ సభ్యులు వ్యతిరేకించారు. చిన్నపాటి పనులకే నిధుల్లేక ఇబ్బందులు పడుతున్నామని ఎలా నిధులు కేటాయిస్తారంటూ అభ్యంతరం తెలుపడంతో ఈ అంశాన్ని వాయిదా వేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ జోగు ప్రేమేందర్

క్లుప్తంగా

ఉద్యోగ విరమణ సహజం

బజార్‌హత్నూర్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని ప్రధానోపాధ్యాయుడు నరేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడు నరేశ్, హిందీ పండిత్ దేవిదాస్‌లకు ఘన వీడ్కోలు పలికారు. నోడల్ ఆఫీసర్ కిషన్‌గుప్త, నవనీత, మల్లేపూల నర్సయ్య, కొత్త శంకర్, భగత్ బాపురావ్, శ్రీనివాస్, కొడిమెలి గంగయ్య, దామోదర్, భూమన్న, రమేశ్, చందన్‌బాబు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న జాదవ్‌రాము

ఇచ్చోడ: బీజేపీ సభ్యత్వ నమోదును పకడ్బందీగా చేపట్టాలని సోషల్ మీడియా కన్వీనర్ జాదవ్ రాము అన్నారు. శనివారం మండలంలోని దూబార్‌పేట్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. ప్రతీ బూత్‌లో సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. పోలీంగ్ బూత్ అధ్యక్షుడు మల్లేశ్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: బీజేపీ సభ్యత్వ నమోదు ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్వహించారు. శనివారం రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్, జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్‌లు పాల్గొని సభ్యత్వ నమోదును పరిశీలించారు. పార్టీ కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో నాయకులు లింగాగౌడ్, శ్రీకాంత్, సతీశ్, రాచందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ పొదుపు ఖాతా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ పొదుపు ఖాతా కలిగి ఉండాలని నాబార్డ్ ఎఫ్ఎల్‌సీ లోకరాంరెడ్డి, ఇంద్రవెల్లి ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ మెస్రం కోసేరావ్‌లు అన్నారు. శనివారం మండలంలోని దుబ్బగూడలో బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణం పొందాలన్నారు. అదే విధంగా పీఎం జీవన జ్యోతి, సురక్ష భీమా, అటల్ పెన్షన్ యోజనాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంత రైతులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ అధికారి శ్రీరామ రంగనాథ్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి



పనులు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

ఇచ్చోడ: మండల కేంద్రంలో మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని పంచాయతీ ప్రత్యేకాధికారి ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. శనివారం పలు కాలనీలో పారిశుధ్య పనులను పరిశీలించి పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. రోడ్లపై చెత్తాచెదారం ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తోపుడు బండిలో చెత్తను వేసి పంచాయతీకి సహకరించాలని కోరారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

బజార్‌హత్నూర్: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ ద్వారా స్వయం ఉపాధి రుణాలను పొంది ఆర్థిక స్వావలంబన సాధించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ రాథోడ్ ప్రహ్లాద్ అన్నారు. శనివారం కాండ్లీ గ్రామంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు, రైతులకు అవగాహన కల్పించారు. తీసుకున్న రుణాలు వాయిదా పద్ధతిలో సకాలంలో చెల్లించాలన్నారు. బ్యాంకు ఖాతాదారులు జీవిత బీమా, ప్రమాద బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడవి శేఖరావ్, ఐకేపీ సీసీలు తొట్ల శంకర్ యాదవ్, పురుషోత్తం, గంగయ్య, సుభాష్, రాంకిషన్, నర్సయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నేరడిగొండ: విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యనందించాలని తహసీల్దార్ కలీమ్ అన్నా రు. శనివారం మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హాస్టల్, స్టాక్ రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం కావడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ నాగోరావు ఉన్నారు

పిల్లలను ఇంటికి తీసుకెళ్లవద్దు



మాట్లాడుతున్న జీసీడీవో మెస్రం ఛాయా

నార్నూర్: చిన్నచిన్న పండుగలకు విద్యార్థులను ఇంటికి తీసుకెళ్లవద్దని జీసీడీవో మెస్రం ఛాయా అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని అర్జుని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, కొలాంగూడ శాటిలైట్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అర్జుని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోషకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలపు సీజనల్ వ్యాధుల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు సక్రమంగా పంపించాలని సూచించారు. వ్యవసాయ పనులకు వెంట తీసుకెళ్లకుండా సెలవు రోజుల్లో ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్ చేసేలా సమయం ఇవ్వాలన్నారు. శాటిలైట్ సెంటర్‌ను తనిఖీ చేసి విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. పాఠశాల ఆవరణం, వంటగది, సిక్ రూం శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయుడు నారాయణకు సూచించారు. ఆమె వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు నగేశ్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో కౌన్సిల్ ఎన్నికలు



కౌన్సిల్ ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థులు

నార్నూర్: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎన్నిక కోసం కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాదవ్ విట్టల్ మాట్లాడుతూ.. ఐటీడీవో పీవో ఆదేశాల మేరకు ప్రతీ ఏడాది పాఠశాలలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల నియమావళి, ఎన్నికల నిర్వహణ, ప్రక్రియ గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవటానికి ఈ ఎన్నికలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిలయ్య, ఆడే విశ్వనాథ్, వనిత, శంకర్, ఉజ్వల, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చిన్నారికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

నార్నూర్: ఆదిలాబాద్ మండలంలోని బండగూడ గ్రామానికి చెందిన కినక జల్కల్‌దేవి అనే గిరిజన బాలింత ఇటీవల చనిపోడంతో 8 రోజుల చిన్నారి పాల కోసం ఆరాటపడుతున్నా విషయం తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబానికి చేయూతను అందించాలనే ఉద్దేశంతో అభిమాన్యు వాట్సాప్ గ్రూప్ సభ్యులు మెస్రం శేఖర్, పేందూర్ దీపక్‌లు మానవత దృక్పథంతో పాప పాలకోసం, భవిష్యత్ అవసరాల కోసం శనివారం రూ. 50 వేలు అందజేశారు. కులమతాలకు అతీతంగా దాతలు స్పందించి ఆర్థిక సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు తొడసం నాగోరావు, మెస్రం పరమేశ్వర్, మెస్రం సాయి, మరప గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ప్రత్యేకమైనది



సన్మానిస్తున్న బానోత్ గజానంద్ నాయక్

నార్నూర్: ఉపాధ్యాయ వృత్తి సమాజంలో ప్రత్యేకమైనదని, అంకిత భావంతో పనిచేసినప్పుడే ఉద్యోగికి సమాజంలో గుర్తింపు వస్తుందని మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు మజురుద్దీన్ సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు తమ భవితను తీర్చిదిద్దుతారని కాబట్టి సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి గౌరవం ఉందన్నారు. కార్యక్రమంలో మండల సెక్టోరియల్ అధికారి పవర్ అనిత, పాఠశాల చైర్మన్ హసన్ ఖాన్, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేష్, షేక్ దాదేఅలీ, షేక్ దస్తగిర్, ఫిరోజ్ ఖాన్, హరిచంద్ చౌహన్, అఖిల్ పాల్గొన్నారు.

రేషన్ కార్డులేని రైతులకు రుణమాఫీ



దరఖాస్తులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

ఇచ్చోడ: రేషన్ కార్డు లేని ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తింస్తుందని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయాధికారి శ్రీధర్ స్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో రేషన్ కార్డులు లేని రైతుల నుంచి స్వీకరిస్తున దరఖాస్తుల ప్రకియను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డులు లేని రైతుల నుంచి ప్రభుత్వ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. యాప్‌లో రైతుతో పాటు కుటుంబసభ్యులు వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి పంపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రకియ పూర్తి తర్వాత రేషన్ కార్డులు లేని ప్రతీ రైతుకు రుణమాఫీ అవుతుందన్నారు. జిల్లా టెక్నికల్ ఏవో శివకుమార్, మండల వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్, ఇచ్చోడ ఏఈవో సంజీవ్‌నాయక్ ఉన్నారు.

కుంగిన సీసీరోడ్డు



రోడ్డు కుంగి ఏర్పడిన గుంత

తాంసి: భీంపూర్ మండలంలోని కమట్‌వాడ గ్రామంలో గతంలో నిర్మించిన సీసీరోడ్డు కుంగిపోయింది. గ్రామంలోని ప్రధాన సీసీరోడ్డు పలుచోట్ల గుంతలు పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

3న మెగా జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలను కల్పించేందుకోసం ఈనెల 3న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సెంట్రల్ గార్డెన్‌లో ఉదయం 10.30గంటలకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. జీఎంఆర్ గ్రూప్, రక్ష సంస్థ సహకారంతో ఆదిలాబాద్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించనునట్లు పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో స్వప్నశీల అన్నారు. శనివారం ఆ మె మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థలో ఇళ్లలో ఎవరైనా ఉంటే వెంటనే ఖాళీ చేయాలన్నారు. ఎవరూ కూడా వాగులు, చెరువులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

శబరిమాత మార్గంలో నడవాలి

తలమడుగు: ఆధ్యాత్మిక గురువు శబరిమాత చూపిన మార్గంలో నడవాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ సునీత వెంకట్ అన్నారు. శనివారం మండలంలోని అర్లి(కె)లో 27 రోజులుగా నిర్వహిస్తున్న శబరిమాత అఖండ జ్యోతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆధ్యాత్మిక ఆత్మజ్ఞాన సదస్సులో పాల్గొని మాట్లాడారు. అఖండ జ్యోతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ హసిబుల్లా అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని సీడీపీవో కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరిగాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న భీం ఆర్మీ నాయకులు

ఇంద్రవెల్లి: నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ మహార్‌లకు అవకాశం కల్పించాలని భీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్‌వాగ్ సందీప్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ కోసం అహర్నిశలు పనిచేసిన వారికి అవకాశం కల్పించాలని కోరారు. కాంగ్రెస్‌కు అండగా ఉన్న ఎస్సీ మహార్‌లకు కనీసం నామినేటెడ్ పదవుల్లోనైనా న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతీష్, సూర్యవంశీ ఉత్తం, పరత్వాగ్ దత్త, కాంబ్లే విక్రమ్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన కోసం 'స్టీల్ బ్యాంక్'



స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న అధికారి

నార్నూర్: ప్లాస్టిక్ నిర్మూలన కోసం ఇందిరా క్రాంతి పథకం ఆధ్వర్యంలో మహిళ శక్తి కింద గాదిగూడ మండలంలోని లోకారి(కె) గ్రామంలో ఏర్పాటు చేసిన స్టీల్ బ్యాంకును శనివారం మండల ప్రత్యేకాధికారి డీఎల్‌పీవో ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో జరిగే శుభకార్యాలు, చిన్నచిన్న ఫంక్షన్లలో అధికంగా ప్లాస్టిక్ వస్తువులను వాడుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలన కోసం మహిళా శక్తి పథకం కింద ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని ఒక గ్రామంలో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేసి అవసరమైన గ్లాసులు, ప్లేట్లు, డిస్‌లు అద్దెకు ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటి వలన గ్రామాలలో ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీఎం మాధవి, ఎంపీవో సాయి ప్రసాద్, మండల సమైక్య సభ్యులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్సై శివరాం

తాంసి: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై శివరాం అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణేష్ మండపాలు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గణేశ్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వారి వెంట ఏఎస్సై కేశవ్ స్వామి, సిబ్బంది భాస్కర్, శ్రీనివాస్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

బేల: భక్తిశ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలను జరుపుకోవాలని జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. గణేశ్ మండపాల వద్ద ఇద్దరు సభ్యులు అందుబాటులో ఉండాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పేకాట, మద్యం, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై రాధిక, గణేశ్ మండలి సభ్యులు, మైనార్టీలు పాల్గొన్నారు.

ఘనంగా అన్నాభావుసాఠే జయంతి



జయంతిలో పాల్గొన్న నాయకులు

ఇంద్రవెల్లి: సాహిత్య సామ్రాట్ అన్నాభావుసాఠే 104వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో స్మారక జెండా వద్ద అన్నాభావుసాఠే, ఛత్రపతి శివాజీ, అంబేద్కర్, కుమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంబ్లే బాలరాజ్, ఆందారే బాలాజీ, కాంబ్లే సునీల్, నగేశ్, లింగంపల్లి రాజన్న, రాందాస్, సంభాజీ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండలంలోని తాండ్ర గ్రామంలో అన్నాభావుసాఠే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నాభావుసాఠే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అన్నాభావుసాఠే అసోషియేషన్ అధ్యక్షుడు కాంబ్లే ఉద్ధవ్, సూర్యకాంత్, పర్మేశ్వర్, మోతీరాం, కోత్మబాయి, రవీందర్, సల్గార్, కేంద్రే రమేశ్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రిజిస్టర్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదిలాబాద్ అర్బన్ తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ శనివారం తనిఖీ చేశారు. చిన్నారుల, అంగన్‌వాడీ టీచర్, ఆయాల హాజరు పరిశీలించారు. చిన్నారుల బరువుపై ఆరా తీశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని సూచించారు. ఆయన వెంట డీటీ రాథోడ్ బాబుసింగ్, సాయికృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త మీనాక్షి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోనే అభివృద్ధి

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమని మాజీ జెడ్పీటీసీ అంబేకర్ పండరి, వీడీసీ చైర్మన్ ఏలేటి రవీందర్ రెడ్డిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో హనుమాన్ ఆలయం, మస్జిద్‌ల వద్ద ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సహకారంతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. బీఆర్ఎస్ నాయకులు ఎండీ సద్దాం, రాథోడ్ సురేందర్, తిరుపతి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బోథ్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి అన్నారు. శనివారం బోథ్ మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ గిరిజన పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వసతి సౌకర్యాలు, విద్య బోధన గురించి అడిగి తెలుసుకున్నారు.

రుణమాఫీ చేయాలి

బోథ్: ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి చిల్కా దేవిదాస్ అన్నారు. బోథ్ మండల కేంద్రంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చిలుక దేవిదాస్, సిరిపురం దాస్, గోవర్ధన్, భోజన్న పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

తలమడుగు: తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న బరంపూర్ కొండ గోవింద నామస్మరణతో శనివారం మార్మోగింది. శ్రీవేంకటేశ్వర ఆలయంలో శ్రావణ శనివారం ముగింపు సందర్భంగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కేదారేశ్వర్ రెడ్డి, సహకార సంఘ చైర్మన్ దామోదర్ రెడ్డి, ప్రేమేందర్ రెడ్డి, మానిష్ రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే



ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ నిర్వహించిన కార్యక్రమం అలరించింది. విద్యార్థుల కేరింతలు, చప్పట్లతో కళాశాల మార్మోగింది. సినీ, జానపద గీతాలపై చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అతిక్ బేగం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలన్నారు. ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.